క్లుప్తంగా

వ్యాపారాభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న అధ్యక్షుడు మధుకర్

లక్సెట్టిపేట: రైతులు సహకార సంఘ వ్యాపారాభివృద్ధికి కృషి చేయాలని సొసైటీ అధ్యక్షుడు మధుకర్ అన్నారు. మండలంలోని చందారంలో రైతు పొదుపు పరపతి మార్కెటింగ్ పరస్పర సహాయక సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన 70వ అఖిల భారత సహకార వారోత్సవాల వేడుకల సమావేశంలో మాట్లాడారు. జెండా ఎగురవేసి సంబురాలు చేసుకున్నారు. రైతుల సొసైటీ ఆధ్వర్యంలో అందించే సహకారాలను వినియోగించుకోవాలని తెలిపారు. 'సహకార సంఘం వ్యాపారాభివృద్ధి' అనే అంశం మీద సభ్యులకు అవగాహన కల్పించి చర్చించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి, డైరెక్టర్లు చిన్నన్న, లక్ష్మారెడ్డి, ఎల్లయ్య, రాజేష్, సీఈవో వినోద్ రైతులు పాల్గొన్నారు.

ఓపెన్ ప్రవేశాలకు గడువు పెంపు

దండేపల్లి: ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో 2023–24 విద్యాసంవత్సరానికి గాను ప్రవేశాలకు ఈ నెల 30వరకు గడువు పెంచినట్లు దండేపల్లి ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ శంకర్‌గౌడ్, సహాయ కో ఆర్డినేటర్ సంగర్స్ రాజేశ్వర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 13తోనే ప్రవేశాలు ముగిసినప్పటికీ, స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా 30వరకు మళ్లీ గడువు పొడగించినట్లు పేర్కొన్నారు. ఇంకా ప్రవేశం పొందని వారుంటే, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు పాఠశాలలో సంప్రదించ వచ్చన్నారు.

ఓటర్ స్లిప్‌తో పాటు గుర్తింపు కార్డు తప్పనిసరి



బీఎల్‌వోలకు స్లిప్‌లు అందజేస్తున్న తహసీల్దార్

జన్నారం: ఈ నెల 30 జరిగే అసెంబ్లీ ఎన్నికలలో ఓటు వేసే ఓటర్లు ఓటరు స్లిప్‌తో పాటు 12రకాల గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి తీసుకెళ్లాలని, ఈ విషయాన్ని ఓటర్లకు చేరవేసేలా చూడాలని తహసీల్దార్ వేణుగోపాల్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం బీఎల్‌వోలకు సమావేశం ఏర్పాటు చేసి, ఓటర్ స్లిప్పులను అందజేశారు. ఈ స్లిప్‌లను ప్రతి ఓటరుకు చేరేలా చూడాలన్నారు. ఓటరు స్లిప్‌ను తప్పనిసరిగా పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లేలా చూడాలన్నారు. ప్రతిఇంటికీ ఓటర్ గైడ్ ఇవ్వాలన్నారు. ఎన్నికల ఉల్లంఘనకు పాల్పడితే సీ విజిల్ ఆప్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సమావేశంలో డీటీ రామ్మోహన్, ఆర్‌ఐ భానుచందర్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మందమర్రిలో ఉద్యమకారుల సమ్మేళనం

మందమర్రిరూరల్: పట్టణంలోని రామకృష్ణపూర్ రోడ్డులో గల శ్రీమంజునాథ ఫంక్షన్ హాల్లో శనివారం సాయంత్రం 4గంటలకు తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం ఉంటుందని తెలంగాణ విద్యార్థి జనసమితి జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, తెలంగాణ ఉద్యమకారులు హాజరవుతారని, సకాలంలో హాజరై విజయవంతం చేయాలని ఉద్యకారులకు పిలుపునిచ్చారు.

ఉచిత వైద్య శిబిరం



మంచిర్యాలటౌన్: మంచిర్యాల వాసవి క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక వైశ్య భవన్‌లో శుక్రవారం ఉచిత వాస్క్యూలర్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ఏషియన్ వాస్క్యూలర్ ఆసుపత్రికి చెందిన వైద్యులు ప్రవీణ్ కుమార్, డాక్టర్ భార్గవ్, డాక్టర్ సోమాచారి, మార్కెటింగ్ ఆఫీసర్ హరిప్రకాశ్ 200 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్మన్ సిరిపురం రాజేశ్, కొంకుముట్టి వెంకటేశ్వర్లు, కొట్టె వంశీకృష్ణ, నలుమాసు ప్రవీణ్, ఎర్రం వెంకటేశ్, మహేశ్, రమేశ్ పాల్గొన్నారు.

ఘనంగా కుమురం భీం వర్ధంతి



కుమురం భీం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆదివాసీలు

కాసిపేట: మండలంలోని కొండాపూర్‌లో ఆదివాసీల ఆరాధ్య దైవం కుమురం భీం వర్ధంతిని ఆదివాసీ సేనా ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాల ప్రకారం భారీగా ర్యాలీ నిర్వహించారు. ప్రసాదాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేసి భీం విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఆదివాసీ వీరుడిని స్మరించుకుంటూ ప్రస్తుతం ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయాలపై యువత ముందుండి ఉద్యమించాలన్నారు. యువత చెడువ్యసనాలకు బానిస కాకుండా చదువుకొని మంచి జీవితాలు సాధిస్తేనే హక్కుల సాధన, సమస్యల పరిష్కారం సాధ్యం అవుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు మడావి గంగారాం, పటేల్ మడావి రాము, రాయిసెంటర్ అధ్యక్షుడు మెస్రం మహదు, కుంరం జనార్దన్, సోయం జంగు, మడావి వెంకటేష్, సంద్ర భూమయ్య, పెంద్రం శంకర్, సిడాం గణపతి, పెంద్రం ప్రభాకర్, మహిళలు తదితరులున్నారు.



దప్పుచప్పుళ్లతో ర్యాలీగా ఆదివాసీలు

'బీసీలను విస్మరించిన ప్రధాన పార్టీలు'



మాట్లాడుతున్న సంజీవ్

చెన్నూర్: రాష్ట్రంలో 50 శాతం ఉన్న బీసీలను ప్రధాన పార్టీలు విస్మరించాయని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది జేక సంజీవ్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ పార్టీలు బీసీ వర్గాలకు మేలు చేసిన దాఖలాలు లేవన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా, బీసీల బతుకులు మారలేదన్నారు. ఎన్నికల సమయంలో ప్రధాన పార్టీలు బీసీలను ఓటర్ల యంత్రాలుగానే వాడుకుంటున్నారని పేర్కొన్నారు. బీసీ ఓటర్లపై పార్టీలకు చిత్తశుద్ధి ఉంటే బీసీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయిస్తామని ప్రకటించాలన్నారు. బీసీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించిన పార్టీలకే మా మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం యువజన సంఘం నాయకులు అన్నల మల్లేశ్, శ్రీనివాస్, శేఖర్, సాయికిరణ్, సతీశ్, సాయికృష్ణ పాల్గొన్నారు.

'తొలిమెట్టు' పూర్తిస్థాయిలో అమలు చేయాలి

కాసిపేట: తొలిమెట్టు కార్యక్రమం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పూర్తిస్థాయిలో అమలు చేయాలని మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ తెలిపారు. మండల కేంద్రంలోని కాసిపేట జిల్లాపరిషత్ పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ.. విద్యార్థులకు వారి తరగతులకు సంబంధించిన అభ్యసన సామర్థ్యాలు బోధించాలని, రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి లచ్చయ్య, కాంప్లెక్స్‌ల ప్రధానోపాధ్యాయులు సాంబమూర్తి, రమేశ్ రాథోడ్, సుధాకర్ నాయక్, మండలంలోని ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.



దండేపల్లి: మాట్లాడుతున్న విద్యాసాగర్

'ఉన్నతి' లక్ష్యాలు నెరవేర్చాలి

దండేపల్లి: ఉన్నతి లక్ష్యాలను నెరవేర్చి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని, భౌతిక శాస్త్ర విషయ పరిశీలకుడు విద్యాసాగర్ అన్నారు. దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం దండేపల్లి, జన్నారం, లక్సెట్టిపేట మండలాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడారు. పాఠ్య ప్రణాళికలు, టీచర్ డైరీలు నిర్వహించి తదనుగుణంగా బోధన చేయాలన్నారు. అనంతరం ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన రమేష్, రాజయ్య, రాజేశ్వర్‌రావులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో రవీందర్, మండల నోడల్ అధికారి చిన్నయ్య, కాంప్లెక్స్ కో ఆర్డినేటర్ మనోహర్, సీఆర్పీ నర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొల్లపల్లి గ్రామాన్ని సందర్శించిన విద్యార్థులు

నెన్నెల: బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఏ ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి శుక్రవారం కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో గొల్లపల్లి గ్రామాన్ని సందర్శించారు. గొల్లపల్లి సామాజిక విభాగంలో రాష్ట్ర ఉత్తమ పంచాయతీ అవార్డుకు ఎంపికైన సందర్భంగా ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగంలో భాగంగా విద్యార్థులు విలేజ్ విజిట్ చేసి క్షేత్ర స్థాయిలో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించారు. డంపింగ్‌యార్డు, పల్లెప్రకృతివనం, వైకుంఠదామం, ప్రభుత్వ పాఠశాలలు, రోడ్లు, డ్రెయినేజీలను సందర్శించారు. గ్రామీణ అభివృద్ధిపై డిగ్రీ ఫైనల్ ఇయర్‌లో పాఠ్యాంశం ఉండటంతో విలేజ్ విజిట్ చేసినట్లు ప్రభుత్వ పాలన శాస్త్ర అధ్యాపకులు గజెల్లి మోహన్ తెలిపారు. గ్రామపంచాయతీ అభివృద్ధి, సర్పంచ్ విధులు, అధికారాలు, ప్రజల భాగస్వామ్యం, పన్నుల గురించి కార్యదర్శి రంజిత్, సర్పంచ్ శశికళ విద్యార్థులకు వివరించారు. గ్రామంలో ఐక్యత ప్రజల భాగస్వామ్యం, పరస్పర సహకారం ఉండటంతో ఇంత చక్కటి అభివృద్ధి సాధ్యమైందని సర్పంచ్ తెలిపారు. పరిపాలన విధానం చాలా బాగుందని డిగ్రీ విద్యార్థులు, ఉపాధ్యాయులు సర్పంచ్, కార్యదర్శులను అభినందించారు.



డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న డిగ్రీ విద్యార్థులు

పొదుపు ఖాతాల మేళా



చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాద గ్రామంలోని బ్రాంచ్ పోస్టాఫీస్‌లో శుక్రవారం పొదుపు ఖాతాలకు సంబంధించిన మేళా నిర్వహించారు. పోస్టల్ ఏఎస్పీ రామారావు పాల్గొని పొదుపు, పోస్టల్ ఇన్సూరెన్స్ గురించి తెలియజేశారు.

అయ్యప్ప ఆలయంలో మండల పూజ

మందమర్రిరూరల్: పట్టణంలోని హరిహర స్వామి దేవాలయంలో ఆలయ నిర్వాహకులు శుక్రవారం అయ్యప్ప మండల పూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి హోమం, అయ్యప్ప స్వామి ఆరాధన , పూజలు చేపట్టారు. అనంతరం అయ్యప్ప స్వామికి ప్రత్యేక భజనలు నిర్వహించారు. భక్తులు ఒకేచోట కూర్చొని సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చె(చి)త్త శుద్ధి ఏది?

భీమిని: మండల పరిధిలోని ఎర్రవాగులో కోళ్ల వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లు, సీసాలు పడేయడంతో నీరు కలుషితంగా మారుతోంది. నీటిని తాగుతున్న పశువులు అనారోగ్య బారిన పడుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని, వాగు వద్ద వ్యర్థాలు పడేయకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.



నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

- మంచిర్యాల కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రేంసాగర్‌రావు

దండేపల్లి: ఒక్కసారి అవకాశం ఇచ్చి గెలిపిస్తే మంచిర్యాల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తా అని మంచిర్యాల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. మండలంలోని తాళ్లపేట, నాగసముద్రం గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలు ప్రేంసాగర్‌రావుకు బ్యాండు మేళాలతో స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రేంసాగర్‌రావు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చేతిగుర్తుకు ఓటేసి కాంగ్రెస్ పార్టీని బారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీపీ శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సతీష్, సర్పంచ్‌లు కళావతీ, లచ్చుపటేల్, శంకరయ్య, ప్రేమల, ఎంపీటీసీలు హేమలత, శ్రీనివాస్, మోహన్, నవీన్, మాజీ వైస్ఎంపీపీ రాజేందర్, ఉపసర్పంచ్‌లు,యూత్ మండల అధ్యక్షుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్: ప్రేమ్‌సాగర్‌రావు సమక్షంలో బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పానుగోటి రంగారావు, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు తిప్పని భీమయ్య, నస్పూరులోని బీజేపీ ముఖ్య నాయకులు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు.



మాట్లాడుతున్న ప్రేంసాగర్‌రావు

అందరికీ ఇళ్ల పట్టాలిప్పిస్తా

శ్రీరాంపూర్: ఏరియాలోని సింగరేణి స్థలాల్లో ఇళ్లు కట్టుకున్న ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలిప్పిస్తామని ప్రేంసాగర్‌రావు తెలిపారు. శ్రీరాంపూర్ బస్టాండ్‌లోని వారాంతపు సంత వద్ద కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచార సభ నిర్వహించారు. పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా వారికి ఆయన కండువా కప్పి స్వాగతం పలికారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మేనిఫెస్టోను పూర్తి స్థాయిలో అమలు చేస్తామన్నారు. ప్రజలంతా ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో నస్పూర్ పట్టణ అధ్యక్షుడు బండారి సుధాకర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుర్మిళ్ల వేణు, నాయకులు చిలుముల రాయమల్లు, తెనుగు దేవేందర్, జైపాల్‌రెడ్డి, తాళ్ల సంపత్ రెడ్డి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



దండేపల్లి: అభివాదం చేస్తున్న ప్రేంసాగర్‌రావు

ప్రజా వ్యతిరేక పాలనకు చరమగీతం పాడాలి

- చెన్నూర్ బీజేపీ అభ్యర్థి దుర్గం అశోక్

రామకృష్ణాపూర్: ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తూ అన్ని వర్గాల ప్రజలను వంచించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి చరమగీతం పాడాలని బీజేపీ చెన్నూర్ నియోజకవర్గ అభ్యర్థి దుర్గం అశోక్ అన్నారు. పట్టణంలోని సూపర్‌బజార్ ఏరియాలో శుక్రవారం ఇంటింటా ప్రచారాన్ని చేపట్టారు. అవినీతి ఊబిలో కూరుకుపోయిన బీఆర్‌ఎస్‌కు ప్రజలు ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. నాయకులు పాలరాజయ్య, రాంకిషోర్, ప్రసాద్ పాల్గొన్నారు.

'బీజేపీ శ్రేణులకు దిశానిర్దేశం'

మందమర్రిరూరల్: ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం అశోక్ దిశానిర్దేశం చేశారు. మాజీ ఎమ్మెల్యే సంజీవరావు ఇంటి వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశానికి అశోక్ హాజరై పార్టీ ప్రచారం కోసం చేపట్టాల్సిన వ్యూహాన్ని వివరించారు. కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ, బీజేపీ కమలం పువ్వు గుర్తును గెలిపించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకులు సంజీవరావు, బీజేపీ, అనుబంధ సంఘాల నాయకులు డీవీ దీక్షితులు, దుర్గరాజ్, రాయమల్లు, కుమారస్వామి, రమేశ్, ఐలయ్య, వెంకటేశ్, పోశం, ఆనంద్ తదితరులు ఉన్నారు.



ఆర్‌కేపీలో ప్రచారంలో పాల్గొన్న దుర్గం అశోక్



దిశానిర్దేశం చేస్తున్న దుర్గం అశోక్

'బహుజనులను మోసం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ'

ఖానాపూర్: బహుజనులను మోసం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు బుద్ధి చెప్పాలని బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధి నర్సాగౌడ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. ఆ రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. సమావేశంలో భాస్కర్, రాజేందర్, మురళి, శ్రీనివాస్, కిశోర్, సురేశ్, సత్యనారాయణ, సంతోశ్, గంగాధర్, రాజన్న, ప్రవీణ్ పాల్గొన్నారు.

కేటీఆర్ సభకు తరలిన శ్రేణులు

ఖానాపూర్: జన్నారంలో నిర్వహించిన మంత్రి కేటీఆర్ సభకు మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులు తరలివెళ్లారు. ఆయా గ్రామాల నుంచి వాహనాల్లో వెళ్లారు.

కడెం: జన్నారంలో శుక్రవారం నిర్వహించిన మంత్రి కేటీఆర్ సభకు మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఆయా గ్రామాల నుంచి ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ శ్రేణులు కలిసి ప్రత్యేక వాహనాల్లో జన్నారం వెళ్లారు.

ఇంద్రవెల్లి: జన్నారంలో నిర్వహించిన మంత్రి కేటీఆర్ సభకు మండల కేంద్రం నుంచి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మారుతి డోంగ్రె ఆధ్వర్యంలో నాయకులు వాహనాల్లో తరలివెళ్లారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, బీఆర్‌ఎస్ కార్యకర్తలు సుఫీయన్, కోవ రాజేశ్వర్, రాథోడ్ మోహన్‌నాయక్, మీర్జా జీలానిబేగ్, జాదవ్ లఖన్ ఉన్నారు.



చిన్నబెల్లాల్ నుంచి సభకు వెళ్తున్న గ్రామస్తులు



ఇంద్రవెల్లి: తరలివెళ్తున్న నాయకులు

కేటీఆర్‌కు ఘన స్వాగతం



అభిమానులకు అభివాదం చేస్తున్న కేటీఆర్

నస్పూర్: ఎన్నికల ప్రచారంలో భాగంగా మంచిర్యాల నియోజకవర్గంలో రోడ్ షోలో ప్రచారానికి వచ్చిన మంత్రి కేటీఆర్ కలెక్టరేట్‌లోని హెలీ ప్యాడ్‌లో దిగిన ఆయనకు స్థానిక ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు, ఎమ్మెల్సీ భాను ప్రసాద్, మంథని ఎమ్మెల్యే పుట్ట మధు, బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తదితరులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. తదనంతరం మంత్రి బైక్ ర్యాలీతో మంచిర్యాలకు బయలు దేరి వెళ్లారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, కౌన్సిలర్లు వంగ తిరుపతి, బేర సత్యనారాయణ, టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, గౌరవ అధ్యక్షుడు కెంగర్ల మల్లయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు కే.సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

దండేపల్లి: మండలంలోని నంబాల గ్రామానికి చెందిన చుంచు రవళి, కోవ శ్రీలత నిరుపేదలు కావడంతో వారికి నంబాల సేవసమితి వారితో పాటు, లక్సెట్టిపేట శివ సాయి గణేష్ సేవా సమితి వారు ఒక్కొక్కరికి రూ.2వేల విలువ చేసే నిత్యావసర సరుకులు శుక్రవారం అందించారు.

ఘనంగా నాగుల చవితి



చెన్నూర్: పట్టణంలోని నాగుల చవితి వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక శివాలయంలో గల పుట్టలో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. కార్తీక మాసంలో తొలి శుక్రవారం రోజున నాగుల చవితి రావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో శివాలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు వేమారం మహేశ్వర్ శర్మ పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: మండలంలోని కాచనపల్లిలోని నాగులమ్మ ఆలయం వద్ద శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పుట్టలో పాలు పోసి, తీపి పదార్థాలను నైవేద్యంగా పెట్టారు. బోనాలు పోసి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పవర్‌కట్ ప్రాంతాలు



నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నూర్: చెన్నూర్‌తో పాటు మరో మూడు మండలాలలో శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. మంథని నుంచి చెన్నూర్‌కు సరఫరా అయ్యే 132కేవీ లైన్ మరమ్మతుల కారణంగా చెన్నూర్, భీమారం, కోటపల్లి, వేమనపల్లి మండలాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

విద్యార్థుల శక్తిసామర్థ్యాలను వెలికితీయాలి

తాండూర్: విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న శక్తి సామర్థ్యాలను వెలికి తీయాలని ఎంఈవో ప్రభాకర్ అన్నారు. తంగళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ఈయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల శక్తి సామర్థ్యాలను వెలికి తీయడం వల్ల చదువులో ఉన్నతంగా రాణించడానికి అవకాశాలు ఉంటాయన్నారు. విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో మండల నోడల్ అధికారి మల్లేశం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయప్రకాశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో ప్రభాకర్

కేటీఆర్ వస్తున్నారని రోడ్లు ఊడ్చారు



మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని రోడ్లను గత కొంతకాలంగా మున్సిపల్ కార్మికులు ఊడ్చడం లేదు. రోడ్డు వెడల్పు పనులు, రోడ్డు మధ్యలో డివైడర్ ఎత్తు నిర్మాణ పనులు, నాలుగు జంక్షన్ల పనులు జరుగుతుండడంతో రోడ్లన్నీ మట్టి, దుమ్ము పట్టి ఉన్నాయి. శుక్రవారం మంత్రి కేటీఆర్ రోడ్డు షో ఉండడంతో చున్నంబట్టి వాడ నుంచి రోడ్డు షో జరిగే ప్రాంతంలో ఉన్న రోడ్లన్నింటినీ మున్సిపల్ కార్మికులతో ఊడిపించారు. గత కొంతకాలంగా పట్టణ ప్రజలు దుమ్ముధూళితో ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోని మున్సిపల్ అధికారులు, మంత్రి పర్యటన కోసం రోడ్లను శుభ్రపరచడం బాగుందని, ఇలా వారానికి ఒకరు వస్తే రోడ్లు శుభ్రంగా ఉంటాయని పట్టణ ప్రజలు చర్చించుకోవడం గమనార్హం.